'ఇడుపలపాయ'ను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ చేస్తామనలేదే!

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి, జగన్మోహన్ రెడ్డి ఇడుపలపాయను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌ను చేస్తామనలేదని, విశాఖపట్నానికి ఎగ్జిక్యూ టివ్ క్యాపిటల్ చేస్తానంటే, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కలిగే ఇబ్బంది ఏంటని, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ధర్మాన ప్రసాదరావు ప్రశ్నించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే భూసర్వే, భూ రక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు జూమ్ కెమెరాకు దగ్గరగా, రాష్ట్రానికి దూరంగా తెలంగాణలో వుంటాడని తెలిపారు. మా తండ్రులు, తాతలు కొన్ని సంవత్సరాలు చెన్నై రాజధానికి నాడు వెళ్ళారని, ఆ తర్వాత మా తండ్రులు, తాతలు కర్నూలు రాజధానికి వెళ్ళామని, అనంతరం హైదరాబాద్ రాజధానికి వెళ్ళామని అన్నారు. ధర్మాబద్ధంగా జగన్మోహన్‌రెడ్డి ఆలోచించటం వలన విశాఖ రాజధాని చేస్తామని చెప్పటం మన ఉత్తరాంధ్ర ప్రజల అదృష్టమని అన్నారు. ఈ మూడున్నర సంవత్సర కాలంలో రూ.1.73లక్షల కోట్లు రాష్ట్రంలో అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో దళారీ వ్యవస్థ లేకుండా సిఎం, జగన్ వేస్తున్నారని, ఇప్పటికీ శ్రీకాకుళం వెనుకబడిన జిల్లాగా వుందని సర్వేలో వెల్లడయ్యిందని, దివంగత డా.రాజశేఖరెడ్డి, నేటి ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి కృషితో జిల్లాకు ఎన్నో ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ మంత్రిగా పదవికి రాజీనామా చేస్తానని, పార్టీకి పనిచేస్తానని చెపితే, వద్దని రానున్న ఎన్నికల్లో పోటీ చేయమని, జిల్లా మొత్తం తిరిగి అభివృద్ధికి కృషి చేయాలని జగన్మోహర్‌రెడ్డి చెప్పారని, విశాఖను రాజధానిగా వ్యతిరేకిస్తున్న తెలుగుదేశం పార్టీని వచ్చే ఎన్నికల్లో మట్టి కరిపించాలని ప్రసాదరావు కోరారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

సీఎం డ్యూటీలో అపశృతి

విశాలాంధ్ర-నరసన్నపేట : పోలీసుల విధి నిర్వహణలో విషాదం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మృత్యువాత పడ్డారు. పోలీసుల వివరాల మేరకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లి ట్రాఫిక్ స్టేషన్లో పనిచేస్తున్న ఎర్రంశెట్టి అప్పారావు(55) ముఖ్యమంత్రి బందోబస్తు నిమిత్తం మంగళవారం నరసన్నపేట వచ్చారు. అప్పటికే అనారోగ్యంతో సతమతమవుతున్న మృతుడు అప్పారావు స్థానిక కళ్యాణమండపంలో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు. బుధవారం 12 గంట లకు తనకు తీవ్ర అస్వస్థతగా వుందని తోటి పోలీస్ సిబ్బందికి తెలియ చేయటంతో, వారు హుటా హుటిన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించ టంతో పోలీసు సిబ్బందిలో విషాదం అలుముకుంది. విషాద వార్త తెలుసుకున్న డిఐజి, హరికృష్ణ, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక, స్థానిక సిఐ, రాము, ఎస్.ఐ, సింహాచలం ప్రైవైటు ఆసుపత్రికి వెళ్ళి మృతుడు అప్పారావు మృతదేహాన్ని అనకాపల్లికి తరలించారు.

ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమైనది

విశాలాంధ్ర-మందస : విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమైనదని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కె.ప్రకాశరావు అన్నారు. బుధ వారం మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు అధ్యక్షతన నిర్వ హించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దుతున్నామని, జిల్లాలో 35 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 350 కోట్ల రూపాయల నిధులతో నాడు-నేడు పథకం పథకం అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి మంచి మార్కులు సంపాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాల న్నారు. కార్యక్రమంలో పలాస, టెక్కలి కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.వెంకటమోహన్, ఆర్.జనార్ధన్, అధ్యాపకులు మార్పు కృష్ణమోహన్, జి.లక్ష్మీనారాయణ, తమ్మినేని వాసుదేవరావు, ఎన్ఎస్ఎస్ పివోలు రమణమూర్తి, ప్రవీణ్‌కుమార్, విజయలక్ష్మీ, లవ కుమారి పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ వహిస్తే అద్భుతమైన ఫలితాలు

విశాలాంధ్ర-పొందూరు : చదువుకు వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేకశ్రద్ధ, కృషితో తర్ఫీద్ చేస్తే అద్భుతమైన ఫలితం లభిస్తుందని బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ టంకాల కరుణాకర్‌రావు అన్నారు. ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో నిర్వహించిన స్కూల్ రెడీనెస్ అండ్ బాలవికాస్ ప్రోగ్రాంలో భాగంగా ప్రాజెక్ట్ రెండవ విడత కార్యక్రమం పొందూరు, జి.సిగడాం మండలాలకు సంబంధించిన 24 మంది విద్యాసాతి వాలంటీర్లకు ఒకరోజు పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖాధికారి రామరాజు, మండల డిప్యూటీ విద్యాశాఖ అధికారి గరుగుబిల్లి శ్యామలరావులు పాల్గొన్నారు. వెనుకబడిన పిల్లలు కోసం ఎలా భోధించాలో అనేటటువంటి అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ ప్రోగ్రాం ఉద్యేశ్యం గురించి చెప్తూ, ఒక ఉపాధ్యాయునిగా "బోధనా-అభ్యసనా పక్రియ" విధానంను విపులంగా వివరించారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయునిగా శిక్షణ నిమిత్తము ఇటువంటి కృత్యాధార బోధన ద్వారా శిక్షణ పొంది ఒక వాలంటరీగా చేయడం గర్వకారణం అన్నారు. ప్రాజెక్ట్ లెర్నింగ్ కోఆర్డినేటర్-టంకల కరుణకరావు భాష నైపుణ్యాలను గురించి అర్థవంతముగా ఎలా భోధించాలో, గణిత బోధన సులువు పద్ధతులను అందులో ఉంటే మెళ్ళవులను గురించివిపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అప్ప నాయుడు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ కాళ్ళ శ్రావణి, వి.వి. సత్యవతి, జి.హేమసుందర్, సోషల్ వర్క్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూరక్ష పథకం ఓ బూటకం

విశాలాంధ్ర-ఆమదాలవలస : ముఖ్యమంత్రి బుధవారం నరసన్నపేటలో ప్రారంభించిన భూ హక్కు భూరక్ష పథకం అంతా ఓ బూటకం ఇది కేవలం నిషేధిత జాబితాలో ఉన్న భూములకు బినామీ హక్కుదార్లుగా వైకాపా సానుభూతిపరులను రికార్డులలో చూపించి ఆ తర్వాత వాటిని కబ్జా చేయదానికే ఈ భూభక్ష పథకం అని టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ ఆరోపించారు. బుధవారం ఆయన విడుదలచేసిన ఒక ప్రకటనలో తెలుగుదేశం ప్రభుత్వం లో ఆర్ఓఆర్ యాక్ట్ ద్వారా భూహక్కులు సమర్థ వంతంగా అమలయ్యేయన్నారు. దుష్ట చతుష్టయంలో ఏ1, ఏ2లేతప్ప ఇతరులు ఎవ్వరూ లేరనేది ముఖ్యమంత్రి తెలుసుకోవాలని కేతువు పలికారు. ఈరాష్ట్రంలో అభివృద్ధి ఏమైనా జరిగిందంటే అది చంద్రబాబు హయాంలో అని తెలుసుకోవాలి. ఈ మూడున్నరేళ్ల వైకాపా పాలనలో విధ్వంసం, వినాశనం తప్ప అభివృద్ధి శూన్య మేనని విమర్శించారు. రైతుకు జీవనాడి అయిన వంశధార పేజ్-2, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్, నాగావళి ఆధునీకరణ పనులు వైకాపా ప్రభుత్వంలో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్న చంధంగా ఉంది. ఎవరిది దోచుకున్న పార్టీయో ఎవరిది దొంగల పార్టీయో ప్రజల నిర్ణయిస్తారని తెలిపారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, ఈ విషయం అధికార పార్టీ నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యిందన్న విషయం అందరికీ తెలిసిందే. త్వరలో జగన్‌కు బైబై చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు.

శ్రీ వెంకటేశ్వరలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల (ఎచ్చెర్ల)లో జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఇక్కడి ఫార్మసీ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో హిమోగ్లోబిన్ పరీక్షన బ్లడ్ గ్రూపింగ్, బాడీ మాస్ ఇండెక్స్, గుండె, కిడ్నీ నరాల సంబందిత వ్యాధులపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మురళీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ తారక రామారావు, ఫార్మా డీ హెచ్‌వోడీ డాక్టర్ పైల బానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విశాలాంధ్ర-కొత్తూరు : రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత నిస్తుందని, రైతుల హక్కులను కాపాడుతుందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం మండలం పొన్నూటూరు, బంకి, ఎమ్.జే.పురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో పాల్గొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం అమలుచేసిన పథకాలు, అభివృద్ధి గురించి స్వయంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికి గడప గడపకు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శాంతి వెంట అధికారులు ,ప్రజా ప్రతినిధులైన పిఏసీఎస్ చైర్మన్ చింతాడా సూర్యనారాయణ, జెడ్పిటిసి ప్రతినిధి కామక త్రినాద్, మండలంకు చెందిన వైసీపీ సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు

ఉపాధ్యాయులకు 'తారలు' శిక్షణ

విశాలాంధ్ర-జలుమూరు : ప్రభుత్వ పాఠశా లల్లో కరోనా కారణంగా వెనుకబడిన 3,4,5 తరగతుల విద్యార్థులు స్థాయిని పెంచేందుకే ఉపాధ్యాయులకు తారలలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో మాధవరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 2వ విడత తరాలు శిక్షణను ప్రారంభించారు. తెలుగు, గణితంలో స్థాయి పెంచే అభ్యసన, కెమికల్స్, మెలకువలపై ఉపాధ్యాయు లకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

చలో పలాసను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-మందస : జీవో 52ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 25న చలో పలాస కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధ వారం ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడ రేషన్ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగన్నాయకులు, రాంబాబు, జగన్‌లు పాల్గొన్నారు.

తిలక్ మాతృమూర్తికి నివాళి

వైకాపా నాయకులు పరామర్శ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ మాతృమూర్తి సత్యవతమ్మ మృతిచెందటంతో సంతబొమ్మాళి మండలం, మరువాడ పంచాయతీ వైకాపా నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో తిప్పాన వసంతరెడ్డి, తిప్పాన మణిరెడ్డి, బుడ్డ పాపారావు, తిప్పాన తవుడు, సుగ్గు వినోద్, చిదపాన మల్లేసుతో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు. ఈసందర్భంగా ఆ కుటుంబానికి ప్రఘాఢ సాను భూతి తెలిపారు. తిలక్ మాతృమూర్తి ఆత్మకు భగ వంతుడు శాంతి చేకూర్చాలని వారు ప్రార్థించారు.

అధినేత జగనన్నతో మన ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర-కొత్తూరు: నరసన్నపేటలోసమగ్ర భూ హక్కు పత్రాల జారీ సభకు బుధవారం విచ్చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డికి హెలిపాడ్ వద్ద స్వాగతం పలికిన సందర్భంగా కలిసిన పాతపట్నం, పాలకొండ, రాజాం, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు ఉన్నారు.

సీఎం సభకు రెవెన్యూ యంత్రాంగం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది నరసన్నపేటలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభకు ఆర్టీసీ బస్సులో తరలివెళ్లారు. మండలానికి చెందిన పలువురు రైతులను కూడా ఈ సభకు తీసుకువెళ్లారు. మీ భూమి మా హామీ నినాదంతో ప్రభుత్వం చేపడుతున్న భూహక్కు భూరక్ష కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమైందని తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కంచిలి : మండలంలోని గొల్ల కంచిలి గ్రామానికి చెందిన కే రామారావు కుటుంబానికి ట్రూ హాండ్స్ సంస్థ ప్రతినిధులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుర్లను పోషించు కుంటున్న రామారావు, బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి గురయ్యాడు. చికిత్స కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న అతని గురించి సమా చారం తెలియడంతో సంస్థ ప్రతినిధులు చేయూత అందించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నర్తు కృష్ణంరాజు, సభ్యులు కలసి 10000 రూపాయలు రామారావుకు అందించారు.

వందేళ్ల తరువాత భూసర్వేతో వెయ్యేళ్లు ప్రజల హృదయాల్లో పదిలం

- సీఎం జగన్‌కు వినాయక ప్రతిమ బహూకరణ
- కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : వందేళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో చేపట్టిన భూసర్వేను తిరిగి ఇప్పుడు మరలా సర్వే చేసేందుకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. నరసన్నపేట పట్టణంలో బుధవారం ప్రారంభించిన జగనన్న భూసర్వే, భూరక్షణ పథకం ప్రారంభానికి విచ్చేసిన సందర్భంగా సిఎం జగన్ మోహనరెడ్డిని సూరిబాబు కలుసుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబు జగన్‌మోహనరెడ్డితో మాట్లాడుతూ వందేళ్ల క్రితం చేపట్టిన భూసర్వేను ఇప్పుడు మరలా చేయడం ద్వారా మరో వెయ్యేళ్లు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. రైతులకు, భూ యజమానులకు వారి భూమిపై వారికి హక్కు కల్పించాలన్న ధ్యేయంతో సిఎం జగన్ చేపట్టిన ఈకార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అనంతరం జగన్‌మోహన రెడ్డికి వినాయక ప్రతిమను అందజేసి ఆ ఆదిదేవుని దీవెనలు మీకు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. అలాగే దైవాశీస్సులతో మీరు అందిస్తున్న సంక్షేమ పాలన, అభివద్ధి మరో స్వర్ణ యుగాన్ని తలపిస్తోందని వివరించారు. మీరు మాపై చూపుతున్న ప్రేమాభిమానాలు చిరకాలం ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట శాసన సభ్యులు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లలో కళింగ వైశ్యుల సమస్యలపై సిఎం జగన్ మోహనరెడ్డికి దృష్టికి జిల్లా కళింగ వైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షులు తంగుదు జోగరావు, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు, పంచాయతీ ఉపాధ్యక్షులు పొట్నూరు కృష్ణప్రసాద్‌లతో కలసి వినతిపత్రం అందజేశారు.

జగన్‌కు.. చంద్రబాబుకు పోలికే లేదు

వైసీపీ జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డికి, మాజీ ముఖ్యమంత్రి, చంద్రబాబు నాయుడుకు పోలికే లేదని, నక్కకి, నాగలోకానికి వున్న తేడా వున్నదని, జిల్లా వైసిపి అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో భూసర్వే, భూరక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముందుచూపుతో రాష్ట్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న సిఎం, రాష్ట్రంలో 31లక్షల మందికి ఇళ్ళ పట్టాలు ఇచ్చారని తెలిపారు. వ్యవసాయం, వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, పేద వర్గాలకు సామాజిక గౌరవం అందించే దిశగా పాలన సాగుతోందిని అన్నారు. రాష్ట్రంలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా జరుగు తున్నా టిడిపి నాయకుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ఎక్కడ జరుగుతొందని అంటున్నారని, కళ్ళు లేని కబోదులకు ఏపథకాలు కనిపించవని దుయ్య బట్టారు. రానున్న 2023వ సంవత్సరం డిసెంబర్ నాటి కల్లా భూ సర్వే, భూ రక్ష కార్యక్రమాన్ని శత శాతం పూర్తి చేసి, గ్రామాల్లో భూ తగాదాలకు చెక్ పెట్టడటం జరుగు తోందని, వెనుకబడిన తరగతులకు చెందిన వారికి రాష్ట్రంలో 56 కార్పోరేషన్లు ఏర్పాటుచేసి, సుమారు 400మందిని డైరక్టర్లుగా నియమించి, బిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రి అవుతారని కృష్ణదాస్ జోస్యం చెప్పారు.

సీఎం సభలో పాల్గొన్న పిన్నింటి సాయికుమార్

విశాలాంధ్ర-రణస్థలం : శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం లోని జరిగిన వైస్సార్ జగనన్న శాశ్వత భూ సర్వే రెండో విడత ద్వారా 1.20 లక్షల రైతులకు భూరక్ష పత్రాల పంపిణీ కార్యక్రమం లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భారీ బహిరంగ సభలో వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రణస్థలం మండలం బూత్ కమిటీ కన్వీనర్ చిల్ల వెంకట్ రెడ్డి, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరాము నాయుడు, ఎంపీటీసీ సంఘం అధ్యక్షులు మహంతి చినరామునాయుడు, దేరశాం సర్పంచ్ మీసాల రామారావు, మాజీ ఎంపీటీసీ మహంతి జోగినాయుడు, మహంతి సత్య నారాయణ, మింది శ్రీనివాస్ రెడ్డి, దన్నాన సత్యంనాయుడు, వైస్సార్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

ఎంఈఓ దుప్పల రామారావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : మనబడి నాడు-నేడు కార్యక్రమంతో పాటు పిల్లల సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశా లన్నింటినీ సద్వినియోగం చేసుకొని, బాల బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయా లని మండల విద్యాశాఖ అధికారి దుప్పల రామారావు పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోగల లక్ష్మీనగర్ హైస్కూల్‌లో ప్రధానోపా ధ్యాయులు పేడాడ వెంకట రవణమ్మ అధ్యక్షతన జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో గురు వారం పాల్గొని మాట్లాడారు. అమ్మఒడి పథకం, జగనన్న గోరుముద్ద ,జగనన్న విద్యా కానుక లో పిల్లలకు అందించిన యూనిఫామ్ బెల్టు, బూట్లు, తప్పనిసరిగా పిల్లలందరూ ఉపయో గించేటట్లు ఉండాలని సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్‌లో అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, తదితర అన్నింటికీ బయోమెట్రిక్ అథెంటికేసన్ తీసుకొని ఆన్ లైన్లో పొందుపరచాలని తెలిపారు. ప్రతి క్లాస్‌లో కూడా చదువులో వెనుకపడుతున్న పిల్లలను గుర్తించి, వారి పై ప్రత్యేక దృష్టి పెట్టి బోధన జరగాలని సూచించారు. పాఠశాలకు అవస రమైన మౌలిక వసతులలో స్థల సమస్య వల్ల కొంతమేరకు ఇబ్బంది ఉన్నప్పటికీ, ఉపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధతో పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు విద్యాశాఖ అధికారి పైడి కూర్మారావు, పాఠశాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ప్రశాంత్ కుమార్‌తో పాటు ఈరోజు హాజరైన ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ నిబద్ధత

స్పీకర్ తమ్మినేని సీతారాం



విశాలాంధ్ర-ఆమదాలవలస : వై.ఎస్. జగన్మోహనరెడ్డి దార్శనికతతో రూపు దిద్దుకున్న నవరత్నాల సంక్షేమ పథకాలతో గడప గడపలో సంక్షేమ నిబద్ధత స్పష్టంగా తెలుస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఈమేరకు భుదవారం స్థానిక 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగాస్పీకర్ మాట్లాడుతూ పేదల జీవితాల్లో అత్మగౌరవం పెంపిందింపజేసే దిశగా సంక్షేమ పథకాలుఅమలు చేస్తున్నారని చెప్పారు. మహిళా సాధికారతలో భాగంగా అన్ని సంక్షేమ పథకాలలో అగ్ర తాంబూలం మహిళలకే కేటాయించి ఆడప డుచుల తోబుట్టువు అయ్యారని తెలిపారు. యావత్ భారతావని దృష్టి సారించేలా పాలనలో విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకు కొనసా గు తున్నారన్నారు. విద్య, వైద్యం మెరుగుకు తీసు కుంటున్న చర్యలను ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనరు ఎం.రవి సుధాకర్, ఏ.ఈ కె.అప్పలనాయుడు, నాయ కులు బి.వి.రమణమూర్తి, పద్మావతి, కనక రాజు, ఎం.జోగారావు, ఏ.ఉమామేశ్వరరావు, బి.అజంతాకుమారి, డి.శ్యామలరావు, చిరంజీవి, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు రాత పరీక్ష డిబేట్

విశాలాంధ్ర-టెక్కలి : డిసెంబర్ 10న జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా టెక్కలి డివిజన్‌లో గల జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు మానవ హక్కుల చట్టాలు స్త్రీ హక్కులు సమాజ బాధ్యతపై ఆబ్జెక్టివ్ టైప్ రాత పరీక్షలు, డిబేట్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వివిధ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ పి కొర్లయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బి.నర్సింగరావు రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎం.విష్ణు జోనల్ చైర్మన్ నారా వెంకటేష్ జోనల్ ప్రెసిడెంట్ ఏ.జగదీష్ జోనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కె.రవికుమార్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ బి.సింహాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓ కె.గొల్ల వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 పిఓ డాక్టర్ జగన్నాథ్ బి.సాయి తదితరులు పాల్గొనగా ఈ రాత డిబేట్ కాంపిటీషన్లో గెలుపొందిన విజేతలకు డిసెంబర్ 10 జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలో జరుగు కార్యక్రమంలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయబడతాయని జాతీయ చైర్మన్ రవీందర్‌కుమార్, జాతీయ కార్యదర్శి బాడన దేవభూషణరావులు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోవిందమ్మ పాల్గొన్నారు.

జగన్‌కు 'శ్రీశైన' కార్పొరేషన్ చైర్మన్ రక్ష

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్ రెడ్డికి బుధవారం శ్రీశైన కార్పొరేషన్ చైర్ పర్సన్, చీపురు రాణి రక్షా బంధన్ కట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండవ విడత ప్రారంభమైన జగనన్న భూ-సర్వే, భూ-రక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.ఎం, జగన్‌కు, చైర్ పర్సన్, చీపురు రాణి రక్షా బంధన్ కట్టి, శ్రీశైనులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అనంతరం పొందరి, కూరాకుల కార్పొరేషన్ చైర్ పర్సన్, రాజాపు హైమావతి అప్పన్న మాట్లాడుతూ పొందరి, కూరాకుల కులస్థులకు చెందిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డికి అంద చేశారు. సిఎంను కలిసిన వారిలో మేజర్ పంచాయితీ సర్పంచ్, బుర్లల్లి శంకరరావు, ఎంపిపి, ఆరంగి మురళీధర్, జెడ్పీటిసి, చింతు అన్నపూర్ణ వున్నారు.

డీసీఎంఎస్ అభివృద్ధికి సహకరించండి

ముఖ్యమంత్రిని కోరిన డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్లా సుగుణ

విశాలాంధ్ర-కంచిలి : డీసీఎంఎస్ సంస్థ అభివృద్ధికి చేయూత అందించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి డిసిఎంఎస్ చైర్పర్సన్ సల్ల సుగుణ వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని నరసన్నపేట కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రిని సుగుణ తో పాటు సంస్థ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీఎంఎస్ చైర్పర్సన్ గా తనకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియ చేశారు. అందరి సహ కారంతో సంస్థ ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళుతున్నానని ముఖ్యమంత్రి తెలియజేశారు. సంస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకోవచ్చారు. దీనికి ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

సీఎంను కలిసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

విశాలాంధ్ర-రణస్థలం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో భాగంగా జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

నూతన బోధనా పద్ధతులకు అనుగుణంగా విద్యార్థులకు బోధించాలి

ఎంఈఓ ధనుంజయ మజ్జి

విశాలాంధ్ర-కవిటి: నూతన బోధనా పద్ధతులకు అనుగుణంగా బోధన చేసి విద్యార్థులకు విషయాంశాలు అవగాహన పూరితంగా చెప్పాలని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా బోధనలో మెలుకవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్పిలు జుధిష్టి రౌలో, తులసీదాస్, జగదీశ్వరరావు, సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవచనాలు చెప్పే గరికపాటిని అరెస్టు చేయాలి

పీఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కుసుమ

విశాలాంధ్ర-పలాస : తన ప్రవచనాలలో అడుగడుగునా మహిళలను అవమానపరుస్తూ వారి వేషభాషలను హేలన చేస్తున్న ప్రవచకర్త గరికపాటి నరసింహారావును అరెస్టు చేసి శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పివోడబ్ల్యు) జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. బుధవారం మామిడిపల్లిలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ గరికపాటి వ్యాఖ్యాలను ఖండించాలని, స్త్రీ పురుష సమాన త్వాన్ని బోధించాల్సిన గరికపాటి మహిళల వేషధారణవల్లనే అత్యాచారాలు జరుగుతున్నాయని, అత్యాచారాలకు, లైంగిక వేధింపులకు మహిళలే కారణమని చెప్పడం సిగ్గు చేటని అన్నారు. పెద్ద మనుషులుగా ప్రవచన కర్తలుగా చెలామణి అయ్యే గరికపాటి లాంటి వారి సమర్ధన వల్లనే సమాజంలో అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆమె మండిపడ్డారు. అత్యాచారాలను సమర్థిస్తూ మహిళలను అవమాన పరుస్తున్న గరికపాటిను అరెస్టు చేసి శిక్షించాలని, ఆయన ప్రవచనాలను బహిష్కరించాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలొచ్చినా మహిళలపై అకృత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వాలు మహిళ హక్కులను కాపాడడంలో విఫలమతువున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి గరికపాటిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమెతో పాటు జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శి హేమమ్మలు ఉన్నారు.

ప్రెస్ అకాడమీకి సంక్షేమ నిధిని కేటాయించాలి

సీఎం జగన్‌ను కోరిన మీడియా ప్రతినిధులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ప్రెస్ అకాడమీని బలోపేతంచేసి, పాత్రికేయుల సంక్షేమానికి ప్రత్యేక నిధి కేటాయించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సోషల్ మీడియాతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని, వాటి నియంత్రణకై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలను తక్షణమే పునరుద్ధరణ చేయాలని, సొసైటీలతో సంబంధం లేకుండా అర్హులైన మీడియా ప్రతినిధులకు తహసీల్దార్ స్థాయిలో ఇల్లు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఒక పథకం ప్రకారం రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని, వీటిని నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా హౌసింగ్ కమిటీ అధ్యక్షుడు అల్లు యుగంధర్, విశాఖపట్నం సాక్షి టీవీ ప్రతినిధులు నాయుడు, శంకర్, శాసపు జోగి నాయుడులు ఉన్నారు.

ఏఐఐబి పనులకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలో వలు అభివృద్ధి పనులకు గాను కేటాయించబడిన ఏ.ఐ.ఐ.బి నిధులతో చేపట్ట బోయే పనులు, వాటికి కేటాయించిన స్థలాలను బుధవారం ప్రత్యేక బృంధం బుధవారం పరిశీలించింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్ మెంట్ బ్యాంక్‌కు సంబంధించిన అధికారులు, పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ రాజరావు, డి.ఈ సుధాకర్, కమీషనర్ ఎన్.రమేష్, సచివాలయ పరిధి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో కలిసి పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రతిపాదనల మేరకు స్థలాలను, పనులను పరిశీలించి, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సమీక్షించారు. పనుల నాణ్యతలో లోపాలు ఉండరాదని, సకాలంలో పనులు పూర్తయ్యేలా అధికారులు శ్రద్ధ వహించాలని ఏ.ఐ.ఐ.బి బృంధం స్పష్టం చేసింది.

సీఎంను కలిసిన ఎయిమ్ రాష్ట్ర కన్వీనర్ శ్రీను

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్రంలోని దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలను చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అంబేద్కర్స్ ఇండియా మిషన్ సైనిక్ విభాగం రాష్ట్ర కన్వీనర్ తైక్వాండో శ్రీను కోరారు. శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో సిఎం జగన్ పర్యటనకి విచ్చేసిన సందర్భంగా బుధవారం ఆయనను ప్రత్యేకంగా కలుసుకుని దళితుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న అంబేద్కర్స్ ఇండియా మిషన్ ఎజెండాను సిఎంకి వివరించారు. దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలను చేయడంతో పాటు నిలుపుదల చేసిన దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసారు. అలాగే గతంలో ఉన్న భూమి లేని పేదలకు భూములు కొనివ్వడం, ఎన్ఎస్ ఎఫ్ డీఎస్, ఎన్ ఎస్ కే ఎఫ్ డీఎస్ లాంటి పథకాలు అమలు చేయాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యూనిట్ల ఏర్పాటుకి రాయితీలతో కూడిన రుణాలు ఇవ్వడం వంటివి మంజూరు చేసేలా చూడాలని విజ్ఞప్తి చేసారు. ఎస్.సి,ఎస్.టి సబ్ ప్లాన్ నిధులు దళిత వాడలు,గిరిజన గూడేలలో ఖర్చు చేసేలా చూడాలని కోరారు. దళితులకి రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని విన్నవించారు. దళితులు,గిరిజనులకి పదవులలో రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా ఆర్థికంగా,సామాజికంగా ,రాజకీయంగా ఆయా వర్గాలు అభ్యున్నతి సాధించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సత్యసాయిబాబా జన్మదినోత్సవాలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సత్యసాయిబాబా జన్మదినోత్సం సందర్భంగా, మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సవరపేట పంచాయతీ జొన్నల పాడు గ్రామంలో, స్థానిక ఎంపీటీసీ, సాయిబాబా ట్రస్టు అధ్యక్షుడు త్రినాధరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, తత్సంగసభ, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగె పేదలకు వస్త్ర దానం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, శ్రీ శుభప్రద వెంకటేశ్వరస్వామి ధర్మకర్త రెడ్డి అప్పన్న, వడ్డివాడ సర్పంచ్ గూట్ల మల్లేశ్వరరావు, మెండ రామి నాయుడు, సవ్వాన ప్రసాద్, చిన్ని రవి, వీరస్వామి, ముకుంద, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే బోరుభద్ర, వడ్డివాడ, తదితర గ్రామాల్లో సత్యసాయిబాబా ఉత్సవాలు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వర్సిటీ అభివృద్ధికి సహకరించండి

సీఎంను కోరిన అంబేద్కర్ వర్సిటీ వీసీ



విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డా.బీఆర్ అంబేద్కర్ వర్సిటీ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని, వీసీ ప్రొ. నిమ్మ వెంకటరావు నరసన్నపేటలో బుధవారం కలిసి విన్నవించారు. వర్సిటీలో నూతనంగా నిర్మించిన బాలుర వసతి గృహాన్ని ప్రారంభోత్సవాన్ని ఈ సందర్భంగా సీఎంను ఆహ్వానించారు. ఈ వసతి గృహంలో 300 మంది విద్యార్థులకు ఉండేందుకు వీలుగా 99 గదులు నిర్మించామని, వీసీ సీఎంకు వివరించారు. ఈ వసతి గృహానికి వైఎస్ఆర్ పేరును పెట్టినట్లు వివరించారు. ఆయనతోపాటు వర్సిటీ పాలక మండలి సభ్యులు డా. బుడుమూరు రాజేష్ ఉన్నారు.

జీవో 52 రద్దు చేయాలని కోరుతూ సైకిత శిల్పం

విశాలాంధ్ర-ఆమదాలవలస : మన ముఖ్యమంత్రి నరసన్నపేట వచ్చిన సందర్భంగా ఆయనకు సైఖతశిల్పంతో స్వాగతం చెబుతూ జీవో 52 ని రద్దు చేయమంటూ సైకత నిరసన శిల్పి గేదెల హరికృష్ణ సైకిత శిల్పాన్ని రూపొందించారు. జీవో రద్దుకు నిరసన తెలియజేయడమైనది.

ఘనంగా సత్య సాయి బాబా జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని చండిపుట్టుగ, కపాసుకుద్ది,కవిటి, బి.గొనపపుట్టుగ, బొరివంక తదితర గ్రామాలలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువజాముస గ్రామంలో నగర సంకీర్తన కార్యక్రమంతో కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సత్య సాయి బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి 24 గంటల పాటు అఖండనామ సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. చండిపుట్టుగ గ్రామంలో గల భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భక్త బృందం ఆధ్వర్యంలో 12 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి 2 వేల రూపాయలు విలువచేసే నిత్యవసరాలు (బియ్యం, పప్పులు, ఆయిల్, కూరగాయలు, దుప్పట్లు) లను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్తబృందం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బూర్జలో : మండలంలోని లక్కుపురం గ్రామంలో భగవాన్ శ్రీ సత్య సాయిబాబా జన్మదిన వేడుకలను స్థానిక యంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలబాలికలు పగటి వేషాలు, కోలాటం వంటి ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. బూర్జ, చినలంకాం, తోటవాడ, మధనాపురం గ్రామాల్లో బాబా వేడుకలు నిర్వహించారు. వేకువ ఝాము నుండి భక్తులు సాంప్రదాయ బద్ధంగా భక్తి శ్రద్ధలతో పూజలు, భజనలు నిర్వహించారు. బాబా చిత్ర పఠాన్ని గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. చినకురింపేట, కే.కె రాజపురం, ఏ.పీ.పేట, రాజుపేట, పి.ఎల్ దేవిపేట భక్తులు అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో : మండంలోని దోమాంలో స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి 97వ జయంతోత్సవాలు ఈ నెల 18 నుంచి 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహించారు. బుధవారం మహా నగర సంకీర్తన, గ్రామ పురవీధుల్లో స్వామి ఊరేగింపు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప, భవానీ మాలధారణ భక్తులకు అల్పహారం అందించారు. అలాగే నిరుపేదలకు అమృత కలశాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, జిల్లా సేవాదళ సమన్వయకర్త ఎస్.రామచంద్రరావు, రాష్ట్ర విద్యా జ్యోతి ఇన్‌చార్జి గురుప్రసాద్, దోమాం మందిరం కన్వీనర్ ఉప్పాడ నీలయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన కొంగరాం గ్రామంలో కూడా సత్యసాయి జయంతోత్సవాలు నిర్వహించారు.

వజ్రపుకొత్తూరులో : బైపల్లి గ్రామంలో సత్యసాయి బాబా 97వ జన్మదిన వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా చిత్రటానికి ఊరేగింపు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కన్వీనరు టి.సాయిరాం, బి.రామక్రిష్ణ, నాయుడు, సాయిభక్తులు పాల్గొన్నారు.

సోంపేటలో : సోంపేట పట్టణ సమీపంలో గల సీతయ్య ఫౌండేషన్ వానప్రస్థ ఆశ్రమంలో బుధవారం సత్యసాయిబాబా జయంతిని నిర్వ హించారు. ఆశ్రమంలో నివశిస్తున్న వృద్ధులు, అనాధలు సత్యసాయి చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యసాయి భక్తులు హాజరై ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్జీఓల కోలాహలం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం టౌన్ ఎన్జీఓ సంఘ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముమ్మరమైంది. ఈనెల 27న జరగనున్న నామినేషన్ కార్యక్రమానికి ఉద్యోగులంతా హాజరుకావాలని కోరుతూ సంఘ జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, సంఘ ప్రతినిధులు కె.జయరావు, రాయి వేణుగోపాలరావు, బొత్స శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, రవీంద్ర కుమార్, పి.శ్రావణి, ఐ.చిట్టిబాబు, మెట్ట భూపాలరావు, ఎస్ అప్పలకొండ తదితరులు జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయాలను సందర్శించారు. అటవీశాఖ, పశు సంవర్ధకశాఖ, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయం, సహకారశాఖ కార్యాలయాలను సందర్శించిన వారు ఉద్యోగులతో నేరుగా మాట్లాడి ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు వెళ్లాల్సిన అవసరముందని చెప్పారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు

ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

విశాలాంధ్ర-కొత్తూరు : నరసన్నపేట సమగ్ర భూ హక్కు పత్రాలు జారీ కార్యక్రమానికి సీఎం జగన్మోహన్ రెడ్డి విచ్చేసిన సందర్భంగా సభకు జనాలను తరలించడానికి జిల్లాలో వివిధ బస్సుల డిపోల నుండి పలు ఆర్టీసీ బస్సులు కేటాయించ డంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలకు, కళాశాల లకు వెళ్ళడానికి ఇబ్బందులు పడ్డారు. సీఎం సభకు జనాలను తీసుకువెళ్ళడానికి ఆర్టీసీ బస్సులు కేటాయించిన సంగతి తెలియని విద్యార్థులు, ఇతర ప్రయాణికులు కొంతసమయం వరకు బస్సులు వస్తాయని నిరీక్షించడం కనిపించింది. విషయం తెలుసుకున్న వారు ప్రయాణం అత్యవసరం ఉన్న వారు ఆటోలను ఆశ్రయించారు. కొందరు ఇంటిముఖం పట్టారు.

నేడు వాలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-కంచిలి : మండలంలో వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 11 మంది వాలంటీర్ పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. 11 పోస్టులకు గాను ఆన్లైన్లో 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి ఇంటర్వ్యూ నిర్వహించి అరులైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఉదయం పదిన్నర గంటలకు మండల పరిషత్ కార్యాలయా నికి హాజరుకావాలని తెలిపారు.

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు



విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా పుట్టిన రోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువఝామున నగర సంకీర్తనతో మొదలు పెట్టి సాయంత్రం వరకూ ప్రత్యే ప్రార్ధనలు భజనలు జరిపారు. పూర్ణ కళశాలతో బాబా చిత్ర పటానికి ఊరేగింపు జరిపారు. బాలవికాస్ చిన్నారుల కీర్తనలు ఆకట్టుకున్నాయి. సత్యసాయిబాబా 97వ జయంతోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సంపాదించుకున్న ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థిని డి. అరుణకు కాంస్య పతకాన్ని మండల విద్యాశాఖ అధికారి కె. అప్పారావు చేతుల మీదుగా అందజేసారు. సేవా సమితి కన్వీకనర్ డి. సుబ్బారావు, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్, రోటరీ గవర్నర్ దక్షత క్రిష్ణమూర్తి, సేవాదళ్ కోఆర్డినేటర్ జనార్ధన రావు, పద్మనాభ సాహు, ఆర్. గోపాల రావు, మహిళా కోఆర్డినేటర్ జయంతిసాహు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మందస, పలాస, కాశీబుగ్గలో రియల్ దందా

సాగునీటి కాలువలు, ప్రభుత్వ భూములు కబ్జా

విశాలాంధ్ర-మందస : పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ సూదికొండ ప్రాంతంలో, మందస పంచాయతీలో ప్రభుత్వ శాఖల అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతులు లేని ఈ వ్యాపారం బాహాటంగా సాగుతున్నప్పటికీ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వ శాఖలు మౌనం దాల్చాయి. వివిధ శాఖల్లోని ఉద్యోగులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద ఉచితంగా ప్లాట్లు, లక్షల్లో డబ్బులు తీసుకొని ఇటువంటి వ్యాపారానికి బహిరంగంగా ప్రోత్స హిస్తున్నారు. పంచాయతీలో 20 చోట్ల సుమారు 150 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. పంట పొలాల్లో మట్టి, కంకర కప్పి సాధారణ స్థలాలుగా మార్చి ప్లాట్లు వేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన ఈ ప్లాట్లు పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ పోరంబోగు భూములు, సునాముది సాగునీటి కాలువ, ఫారెస్టు భూములను కూడా కబ్జా చేసి ప్లాట్లు రూపంలో నకిలీ సర్వే నెంబర్లు వేసి అమ్మకాలు చేస్తున్నారు. ఇటువంటి భూములు క్రయ విక్రయాలకు స్థానిక సబ్‌రిజిస్ట్రారు కార్యాలయం వేధికగా తయారైంది. అనుమతులు లేని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కనీసం ప్రభుత్వ శాఖలు నుంచి అభ్యంతరాలు కూడా లేవు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్మకాలు చేసినప్పటికీ ఇటువంటి ప్లాట్లులో విద్యుత్ స్తంభాలు, లైట్లు అనేక చోట్ల ప్రభుత్వపరంగా అమర్చారు. పంచాయతీ ఎన్‌వోసి లేకుండా విద్యుత్ స్తంభాలు రియల్ ఎస్టేట్ అమ్మకాలు చేస్తున్న స్థలాల్లో అమర్చకూడదు. కాని పబ్లిక్‌గా విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇకపోతే ఇటువంటి రియల్ ఎస్టేట్ ప్లాట్లులో నివాస గృహాలకు శుద్ధజలం పంపిణీ చేసేందుకు పంచాయతీ ఉద్యోగులు ప్రోత్సహంతో ఇటీవల ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పైపులైన్ కూడా వేశారు. ఈ పైపులైన్ నిర్మాణంలో పంచాయతీ ఉద్యోగులు ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖపై తీవ్ర ఒత్తిడి చేశారని అంటున్నారు. 15 కోట్ల రూపాయల వ్యయంతో శుద్ధజలం ఇంటింటికి కుళాయిలు ద్వారా పంపిణీ కోసం ప్రభుత్వ పైపులైన్లు నిర్మాణం కోసం చర్యలు చేపట్టింది. ఈ నిధులతో గ్రామంలో పైపులైన్లు నిర్మాణం చేయకుండా సగం పైపులైన్ నిర్మాణం పనులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లులో జరిపారంటే ప్రభుత్వ శాఖలు పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనలకు భిన్నంగా ప్రభుత్వ అనుమతులు లేని ప్లాట్లుకు విద్యుత్, శుద్ధజలం వంటి తాగునీరు సౌకర్యం ఎలా కల్పిస్తున్నారో అంతుబట్టని విషయంగా చర్చనీయాంశంగా తయారైంది.

పడకేసిన సీఎస్‌పీ రహదారి పనులు...!

- గోతుల వద్ద కనిపించని ఇండికేటర్లు
- పనులపై కొరవడిన పర్యవేక్షణ
- నేటికీ తొలగించని విద్యుత్ స్తంభాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

విశాలాంధ్ర-ఆముదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో ఆముదాలవలస శ్రీకాకుళం సిఎస్‌పి రహదారి పనులకు పిఎంజిఎస్‌వై నిధులు 40 కోట్లతో పాటు అదనంగా 18 కోట్ల రూపాయలను ప్రకటించి విడుదల చేశారు. అప్పట్లో జిల్లా వ్యాప్తంగా ముఖ్యమంత్రి నిర్ణయాన్ని అందరూ సమర్థించారు. అయితే అధికారుల్లో సమన్వయం కొరవడి ఆ పనుల నిర్వహణలో ఆధ్యాంతం అలసత్వం నిర్వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. కల్వర్టులు, డివియేషన్‌లు, వద్ద రేడియం స్టిక్కర్లు ప్రమాద సూచికలను తెలియజేసే

బోర్డులను ఏర్పాటు చేయవలసి ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు అడుగులు వేయలేదు. ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే రహదారిపై వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా బెర్మ తవ్వి ఉండటంతో అక్కడ చెలరేగిన దుమ్ము ధూళి కళ్ళల్లో పడి చోధకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించేందుకు టెండర్లను పిలువుగా మొత్తం ఎనిమిది లక్షల రూపాయలు సంబంధిత ఆర్ అండ్ బి గుమస్తా ఖాతాలో గుత్తేదారు జమ చేయటం పలు విమర్శలకు దారి ఇచ్చింది. అంతేకాకుండా రోడ్డు వైపు ఉన్న స్తంభాలను తొలగించి వేరే చోట లైన్ వేసేందుకు విద్యుత్ శాఖకు సుమారు 30 లక్షల రూపాయలు ఆర్ అండ్ బి అధికారులు చెల్లించాల్సి ఉంది. పనులు ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఆ ప్రక్రియ మొదలు కాలేదు. ఇదేమని

ప్రశ్నించిన వారికి నిధులు లేమే అని అధికారులు చెప్పడం విశేషం.

మొబలైజేషన్ నిధులు ఏమైనట్లు..... ముఖ్యమంత్రి విడుదల చేసిన 18 కోట్ల రూపాయలను ఇరువైపులా ఎక్వైర్ చేసిన స్థలం సుమారు 8.2 ఎకరాలకు చెల్లించాల్సి ఉండగా ఆ నిధులనే గుత్తేగారకు మొబలైజేషన్ నిధులుగా సుమారు ఐదు కోట్లు విడుదల చేసినట్లు తెలిసింది. ప్రధమ గుత్తేదారు కొన్ని పనులను సబ్ కాంట్రాక్టర్లకు అందించారు. అలాగే మరి కొంతమంది మొబలైజేషన్ నిధులతో పనులు చేపట్టి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. విశాఖ పట్నంలో ఉండే గుత్తేదారు ప్రస్తుతం జైపూర్ రాజస్థాన్ వంటి ప్రాంతాలకు పర్యటనకు వెళ్లినట్లు తెలిసింది. ఎక్కడ పనులు అక్కడే నిలిపి చేశారు. కాంట్రాక్టర్ వచ్చాక పనులు చేస్తామని అక్కడ సిబ్బంది తెగేసి చెబుతున్నారు. ఇప్పటికే ఖర్చుల నిమిత్తం కాంట్రాక్టర్ కొంత మొత్తానికి చెక్కు ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఆ చెక్కు పైన తన సంతకం లేకపోవడంతో బ్యాంకులో జమ చేయలేకపోయారు. ఇప్పుడు సిబ్బంది జీతాలకు కూడా ఇబ్బంది ఏర్పడింది. అంతేకాకుండా మొబలైజేషన్ నిధులు పూర్తికాగానే కాంట్రాక్టర్ పనులు నిలిపివేసి నట్లు తెలియ వచ్చింది. ముందుగా విడుదలైన 40 కోట్ల రూపాయలు వెనుకకు మళ్లినట్లు ఒక సందర్భంలో డి ఈ వెల్లడించారు. ఆ మొత్తం విడుదలైన అంతవరకు ఇక్కడ పనులు నిలిచిపోవాల్సిందే.

తొలగించిన విద్యుత్ స్తంభాలు.... రెండేళ్లుగా రోడ్డు పనులు

చేపడతామని నిధులు మంజూరు అయినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం కారణంగా అప్పట్లో ఆ నిధులు వెనుకకు వెళ్లాయి. అందుకు కారణం ఎన్నికల నగారా మోగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి ప్రారంభం కాని పనులను నిలిపివేసింది. ఇటీవల ముఖ్యమంత్రి వచ్చి రోడ్డు దుస్థితిని గమనించి తక్షణం 18 కోట్లు విడుదల చేశారు. ఆ నిధులు ఉన్నంతవరకు పనులు నిర్వహించారు. ఇప్పుడు పనులు పడకేసాయి దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకపోవడం ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడమే కారణంగా తెలుస్తుంది. దీంతో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడం ప్రయాణికులు మరింత ఇబ్బంది ఏర్పడింది. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయి. ఇటీవలే విధి నిర్వహణలో ఉన్న హెూంగార్డు ఈ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పరిస్థితులను గమనించి త్వరితగతిన పనులు చేయాలని కోరుతున్నారు. ఏది ఏమైనప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి శాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి పనులు త్వరితగతిన చేపట్టాలని సర్వత్ర కోరుతున్నారు.